ఆర్టీసీకి దసరా బొనంజా

- ప్రయాణకులతో కిక్కిరిసిన బస్టాండ్
- రోజుకు పెరిగిన ఆదాయం రూ.2.5లక్షలు
- గుంటూరు, ఒంగోలు, చీరాల వైపుకు తిరిగే బస్సులు రాక ఆలస్యం
- డిమాండ్ ఉన్న మార్గాలకే ప్రాధాన్యం అంటున్న అధికారులు
- వచ్చే నాలుగైదు రోజుల్లో ఇంకా పెరగనున్న ఆదాయం



నరసరావుపేట బస్టాండ్‌లో వినుకొండ వెళ్లే బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

నరసరావుపేట: ఆర్టీసీకి దసరా పండగ కాసులు కురిపిస్తోంది. గత రెండు రోజుల నుంచి జిల్లా కేంద్రమైన నరసరావుపేట బస్టాండ్‌కు సాధారణ రెవెన్యూ కంటే సుమారు రూ.2లక్షలు అదనంగా లభిస్తోంది. అయితే డిమాండ్‌కు తగ్గట్లుగా బస్సులు లేకపోవడం, సమయానికి అవి బస్టాండ్‌కు చేరుకోకపోవడంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు వెళ్ళేందుకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. డిపో నుంచి వివిధ మార్గాలకు వెళ్లేందుకు 80బస్సులు ఉన్నాయి. వీటి ద్వారా హైదరాబాదు, శ్రీశైలం, తిరుపతి, గుంటూరు, విజయవాడ, వినుకొండ, ఒంగోలు, చిలకలూరిపేట, చీరాలతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు ప్రయాణిస్తున్నాయి. ప్రతిరోజూ వీటి ద్వారా రూ.10.50లక్షల ఆదాయం డిపోకు సమకూరుతోంది.

బస్సుల వద్ద తోపులాట

నరసరావుపేటలో ఉన్న ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, జేఎన్‌టీయూ, ఫార్మసీ, పీజీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో సుమారుగా 30వేలమంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో అత్యధికులు ఇళ్లకు బయలుదేరడం, సెలవులు ఇచ్చారనే కారణంతో కుటుంబ సభ్యుల సహా బంధువుల ఇళ్లకు వెళ్లేవారితో నాల్గవ తేదీన డిపోకు అదనంగా రూ.2.5లక్షల ఆదాయం లభించింది. ఐదో తేదీ శనివారం కూడా బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సుల వద్ద తోపులాట కన్పించింది. గుంటూరువైపు, చిలకలూరిపేట, ఒంగోలు వైపుకు వెళ్లే బస్సులు సకాలంలో రాకపోవడంతో వేచిచూడాల్సిన పరిస్థితి ప్రయాణికులు ఎదుర్కొన్నారు. డిపోకు ప్రధానంగా గుంటూరు, ఒంగోలు, పిడుగురాళ్ల వైపునకు తిరిగే బస్సుల ద్వారానే అధిక ఆదాయం లభిస్తోంది. మొత్తం 80బస్సుల్లో 36 బస్సులు గుంటూరు మార్గంలోనే తిరుగుతూ బస్టాండ్‌కు 50శాతం ఆదాయం సమకూర్చుతున్నాయి. దీంతో పాటు హైదరాబాదు నుంచి వచ్చే ప్రయాణికుల్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా బస్సులను ఏర్పాటు చేశారు. వచ్చే రెండు, మూడురోజుల్లో ఇంకా ఆదాయం పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

డిమాండ్ ఉన్న మార్గాలకు ప్రాధాన్యం



దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్లుగా బస్సులు నడుపుతున్నాం. గుంటూరు, హైదరాబాదులకు ఎక్కువగా ప్రయాణికుల నుంచి డిమాండ్ ఉంది. ఉన్న బస్సులు అన్నింటినీ తిప్పుతున్నాం. అధికారులంతా అప్రమత్తంగా ఉండి ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా బస్సులు నడుపుతున్నాం.

–బత్తుల వీరాస్వామి, డిపో మేనేజర్

మహిళా మార్ట్‌ల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు



నరసరావుపేట రూరల్: మహిళా మార్ట్‌ల ద్వారా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్నట్టు జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి కె.అమలకుమారి తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని మహిళా మార్ట్‌ను ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ మహిళా మార్ట్‌ల్లో సహజ ఉత్పత్తులతో పాటు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రజలు కూడా మార్ట్‌ల్లో లభించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి సోమవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ప్రకృతి వ్యవసాయ స్టాల్‌లో ఉత్పత్తులు లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో భాను, ఎన్‌ఎఫ్‌ఏ భాను, మేరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాదెండ్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా స్వరూపరాణి



నాదెండ్ల: స్థానిక మండల పరిషత్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్. స్వరూపారాణికి ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతలు అప్పగిస్తూ శనివారం జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఆమె అచ్చంపేట మండలంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. గతంలో ఆమె యడ్లపాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన స్వరూపారాణిని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

శివప్రియ నగర్ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే ప్రత్తిపాటికి వినతి

నాదెండ్ల: గణపవరం శివారు శివప్రియనగర్ సమస్యలు పరిష్కరించాలని ప్లాట్ల యజమానుల సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి విన్నవించారు. 1998లో శివప్రియనగర్ వెంచర్ ఏర్పాటు చేయగా తామంతా ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ఇటీవల వెంచర్‌లో కంపచెట్లు, ముళ్ల పొదలు తొలగించి రోడ్లు ఏర్పాటు చేసుకున్నామని, నీరు, విద్యుత్ సరఫరా కల్పిస్తే త్వరలో ఇళ్ల నిర్మాణం చేసుకుంటామని విన్నవించారు. చిలకలూరిపేటలోని పండరీపురం, పోలిరెడ్డిపాలెం, కృష్ణనగర్, ఎన్టీఆర్ కాలనీ, వెంగళరెడ్డి నగర్‌లకు చెందిన మురుగునీరు, చిన్నపాటి వర్షం కురిసినా వరదనీరు శివప్రియనగర్‌ను ముంచెత్తుతోందని తెలిపారు. పెట్రోల్ బంకు నుంచి కుప్పగంజివాగులో కలిసే విధంగా సైడు కాల్వలు నిర్మాణం చేయాలని కోరారు. తాగునీరు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పేలూరి రామారావు, వీరాంజనేయులు, బి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

8న మెగా జాబ్‌మేళా

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 8వ తేదీ ఉదయం 9గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ తెలిపారు. ఈ మెగా జాబ్‌మేళాలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. 18–30 సంవత్సరాల వయసు కలిగి, ఐటీఐ పూర్తి చేసిన వారు హాజరుకావచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటా, ఆధార్ కార్డ్, టెన్త్ క్లాస్ మార్క్ లిస్ట్, ఐటీఐ మార్క్‌లిస్ట్, ఐటీఐ ఎన్టీసీ , బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకం జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకొని పాల్గొనాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 8465819546, 9440542030 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు శరీర, నేత్ర దానంపై అవగాహన సదస్సు

నరసరావుపేట: స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం వర్కింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విజ్ఞాన కేంద్ర ప్రాంగణంలో శరీర, నేత్ర దానం అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా అమ్మనేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘ పల్నాడు, గుంటూరు జిల్లాల కోఆర్డినేటర్ ఎస్.చలపతిరావు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొని శరీర, నేత్ర దానం దిశగా ఆలోచన చేయాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 94913 69330, 91774 79788, 92464 93157 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పలు శాఖల అధికారులు బదిలీలు

బొల్లాపల్లి: మండలంలో పలు శాఖల్లో బదిలీలు జరిగాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ గౌసియాబేగం గురజాల మండలానికి, పంచాయతీ కార్యదర్శులు వేర్వేరు జిల్లాలోని పలు మండలాలకు బదిలీ అయ్యారు. పలుకూరుకు చెందిన పీఎస్ శ్యామల పెదనందిపాడు మండలం, పేరూరుపాడు పీఎస్ పాండురంగారావు తాటికొండ, సరికొండపాలెం పీఎస్ ఏసుబాబు తాటికొండ, గంగుపల్లి తండా పీఎస్ తిరుమలరెడ్డి తర్లపాలెం, మూగచింతలపాలెం పీఎస్ ఎస్. ఏడుకొండలు దుర్గి మండలం బదిలీ అయ్యారు. రెవెన్యూ శాఖలో కనుమలచెరువు వీఆర్వో శ్రీహరి వినుకొండ మండలం, గండిగనుమల వీఆర్వో శివరామప్రసాద్ నరసరావుపేట మండలం, బొల్లాపల్లి వీఆర్వో శ్రీను నాయక్ కారంపూడి మండలానికి బదిలీ అయ్యారని ఆయా శాఖల అధికారులు తెలిపారు.

నేడు గణపవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల: గణపవరంలో సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని వేలూరు రోడ్డు, సినిమా హాల్ రోడ్డు, చవిటిపాలెం, రాజీవ్‌గాంధీ కాలనీ, ఇండస్ట్రీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సాతులూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరులో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. గ్రామంలో రూ.1.20 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. శిలాఫలకాలు ఆవిష్కరించారు. బీసీ, ఎస్సీ కాలనీలు, శివాలయం బజారు, మెయిన్ రోడ్డు, టీసీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందేలా పనులు చేయాలని, సూపర్ సిక్స్ హామీల అమలుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముసుగు శోభారాణి, పార్టీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యడ్లపాడు ఎంఈవోపై క్రమశిక్షణ చర్యలు

నాదెండ్ల: నాడు–నేడు పనుల్లో జరిగిన అవకతవకలపై యడ్లపాడు ఎంఈవో–2 అరుణ్‌కుమారిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. చిలకలూరిపేట పట్టణంలోని శారదా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో అరుణ్‌కుమారి హెచ్‌ఎంగా పనిచేశారు. అప్పట్లో నాడు–నేడు పనుల్లో రూ.10,99,350ల విలువైన చెక్కును థర్డ్‌పార్టీ అయిన ఎస్. సుజాతకు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. ఇసుకను స్థానికంగా పెద్ద మొత్తంలో కొనుగోలుచేసి అధికారులకు వేబిల్లులు సమర్పించలేదు. గ్రానైట్ బండల కొనుగోలులో కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ ఆమెను గతేడాది డిసెంబర్ 21న సస్పెండ్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలను తిరస్కరిస్తూ ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరి 7న విధుల్లోకి అనుమతించారు. అయితే, ఈ వ్యవహారంపై నరసరావుపేట డెప్యూటీ డీఈవోను ఎంక్వైరీ అధికారిగా నియమించారు. విచారణలో ఆమెపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రెండు మేజర్ ఇంక్రిమెంట్లను నిలుపుదల చేసినట్లు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె యడ్లపాడు ఎంఈవో–2గా విధులు నిర్వర్తిస్తున్నారు.

రోడ్డు ధ్వంసం... రాకపోకలకు తీవ్ర ఆటంకం



గణపవరం శివాలయం వీధిలో ధ్వంసమైన సిమెంటు రోడ్డు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం శివాలయం వీధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుకు గండిపడింది. వాహనదారులు గత్యంతరం లేక ఆ రోడ్డు మీదుగానే ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. కుప్పగంజివాగు పరిధిలో సుమారు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉండటంతో రైతులు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ట్రాక్టర్లు, అరకలు, ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు వెళ్తుంటాయి. కొద్దిరోజుల క్రితం పంచాయతీకి చెందిన ట్రాక్టర్ క్వారీ గుంతలో చెత్తను పడవేసేందుకు వెళుతూ బోల్తాపడింది. పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీసి రాకపోకలను నిలిపివేసేందుకు రోడ్డును కట్ చేస్తూ గొయ్యి తవ్వారు. దీంతో రైతులు, వాహనచోదకులు చుట్టూ తిరిగి ప్రయాణిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు పునరుద్ధరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలతో విశేష గుర్తింపు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఏఎంజీ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏలూరు జిల్లా పెదవేగిలోని ఏపీఎస్ డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు అండర్–19 బాలురు, బాలికల విభాగంలో కాంస్య పతకాలు సాధించింది. బాలుర జట్టులో ఏఎంజీ పదో తరగతి విద్యార్థులు చరణ్, డేనిక్, బాలికల విభాగంలో స్వాతి, లక్ష్మీప్రియ ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు



హిజ్రాలను హెచ్చరిస్తున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్

నరసరావుపేటటౌన్: దసరా మామూళ్ల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ హెచ్చరించారు. శనివారం స్టేషన్‌లో హిజ్రాలతో సమావేశం నిర్వహించారు. దసరా మామూళ్ల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రకాష్‌నగర్ డీమార్ట్ వెనుక, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రాత్రుళ్లు హిజ్రాలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉందన్నారు. అటువంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిజ్రాలు అంతా ఆధార్ కార్డులు, ప్రస్తుత చిరునామాలు స్టేషన్‌లో తెలియపరచాలని చెప్పారు. ప్రజలను అసౌకర్య పరుస్తూ ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

సందడిగా దసరా ఉత్సవాలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నరసరావుపేట రూరల్: ఏఎమ్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మామిడి తోరణాలు, రంగవల్లులు, బతుకమ్మలతో కళాశాలలో దసరా పండుగ శోభ ఉట్టిపడింది. బతుకమ్మ ఆటలతో విద్యార్థినులు, అధ్యాపకులు సందడి చేశారు. అనంతరం నిర్వహించిన దాండియా నృత్యంలో సంప్రదాయ దుస్తులతో అధ్యాపకులు, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన మహిషాసుర మర్దిని నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమాలకు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఉత్సవాల వల్ల సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహనతో పాటు సామూహిక చైతన్యాన్ని పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.భార్గవ భూషణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

నార్నెపాడు(ముప్పాళ్ళ): రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, సేంద్రియ ఎరువులు వాడటం వల్ల ఆరోగ్యంతో పాటుగా పర్యావరణానికి హాని తగ్గించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతుల శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పత్తిలో గులాబీ రంగు ఉధృతిని లింగాకర్షక బుట్టలు వాడటం వల్ల తగ్గించుకోవచ్చన్నారు. మరో శాస్త్రవేత్త పి.ప్రవీణ్‌కుమార్ నేలలో సేంద్రియ కర్బన్ శాతాన్ని పెంచుకోవడం వల్ల గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించుకోవచ్చన్నారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త వెంకట్రాములు వరిలో కొత్త వంగడాలు, మినీకిట్‌ల గురించి వివరించారు. జేజీఎల్‌కి ప్రత్యామ్నాయంగా కొత్త వంగడాలు వచ్చాయని వాటిని రైతులు సాగు చేయాలని ఆయన సూచించారు. బీపీటీ 6082 రకం మినీ బ్యాగ్‌ను రైతు జెట్టి నాగమల్లేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ కె.ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం




సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు

చిలకలూరిపేట: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని చెప్పారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయులు మురుకొండ మహేష్, డాక్టర్ ఇంటూరి వెంకటకుమారి, డాక్టర్ కాకొల్లు శ్రీలక్ష్మి, బొప్పూడి రాధ, దండా విజయశ్రీ, ఉప్పాల పద్మజ, నార్నే జయలక్ష్మి, ఆళ్ల పార్వతిలను ఇన్నర్‌వీల్ ఎడ్యుకేషనిస్టు అవార్డులతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గట్టు సరోజిని మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్ని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని కొనియాడారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో విజయానికి నాణ్యమైన విద్య ఎంత కీలకమైనదో, మానవ వనరుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

జయ జయ జయహే మహిషాసురమర్దిని.. !



విప్పర్లలో శ్రీ కామాక్షి అమ్మవారు అన్నపూర్ణమ్మగా



రొంపిచర్లలో శ్రీ వాసవీ అమ్మవారు వైష్ణవిగా ..




శ్రీ శృంగేరి శంకర మఠంలో కౌమారి అలంకరణలో ..



పాతూరులోని శ్రీచౌడేశ్వరీ ఆలయంలో వైష్ణవిగా..



శివప్రియనగర్‌లోని ఆదిపరాశక్తి క్షేత్రంలో అన్నపూర్ణాదేవిగా..



నూజెండ్లలోని చెన్నకేశవ ఆలయంలో అన్నపూర్ణగా..



వడ్డెంగుంటలో శ్రీ అన్నపూర్ణాదేవిగా..



రవ్వవరంలోని జగన్మాత పీఠంలో శ్రీ రాధాదేవిగా..



నరసరావుపేట రెడ్డినగర్‌లోని బతుకమ్మ బాలా త్రిపుర సుందరిగా..



వినుకొండలోని శ్రీ వాసవీ మాత ఆలయంలో చాముండేశ్వరిదేవిగా..

ఆలయాలలో శ్రీ దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు శనివారం అమ్మవారు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయాల్లో లక్ష కుంకుమార్చనలు, మహాచండీ హోమాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు భక్తి భావాన్ని నింపాయి.

– నరసరావుపేట ఈస్ట్/వినుకొండ (నూజెండ్ల)/బొల్లాపల్లి/నాదెండ్ల/నరసరావుపేట ఈస్ట్/రొంపిచర్ల

అర్హులకు ముద్ర రుణాల మంజూరు



డిపాజిట్‌దారులకు పత్రాలు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అర్హులైన వారికి రూ. 10 లక్షల వరకు ముద్ర రుణాలు మంజూరు చేస్తామని ఎస్‌బీఐ శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజర్ వలేటి ప్రసాద్ తెలిపారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో శనివారం డిపాజిట్స్ చేసిన ఖాతాదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ. 2 కోట్ల ముద్ర రుణాల్ని మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలోని మతుకుమల్లిలో అగ్రి డెయిరీ పాడి గేదెల యూనిట్స్ 10 మందికి రూ. 80 లక్షలు, శానంపూడి, పోట్లూరు గ్రామాల్లో 10 మందికి రూ. 80 లక్షల రుణాలను అందజేశామని చెప్పారు. ముద్ర రుణాలు రూ. కోటి దాకా ఇవ్వడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారి మర్రి యశ్వని, నగదు అధికారి శ్రీహరి, బ్యాంకు సిబ్బంది దాసరి ప్రకాష్‌బాబు, ఏస్తేరీరాణి పాల్గొన్నారు.